## నిలిచిన మీసేవ సేవలు

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 11: నెట్‌వర్క్‌లో వచ్చిన లోపంతో మీసేవ సేవలు నిలిచి పోయినట్లు తహసీల్దార్ జానకి తెలిపారు. రాష్ట్ర డాట సెంటర్‌లో వచ్చిన సాంకేతిక సమస్యతో బుధవారం నుంచి మీసేవ సేవలు పూర్తిగా నిలిచిపోయినట్లు ఆమె తెలిపారు. మండల ప్రజలు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

భైంసా, సెప్టెంబర్ 11 : గణేశ్ మండపాల వద్ద అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని భైంసా అగ్నిమాపక శాఖ అధికారి రాజారాం అన్నారు. బుధవారం భైంసాలోని గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సాయన్న, సాయికిరణ్, లింగురాం పాల్గొన్నారు.

## వరద బాధితులకు సహాయార్థం

భైంసా, సెప్టెంబర్ 11 :భైంసాలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన శానిటేషన్ సిబ్బంది వరద బాధితుల కోసం తమవంతుగా రూ. 4,000 పంపించారు. ఇందులో శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

## ఆదివాసీలను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం

భైంసా, సెప్టెంబర్ 11 : ఆదివాసీలను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆదివాసీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు పోతిండ్ల శంకర్ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని విశ్రాంతి భవనం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీలపై జరుగుతున్నటువంటి లైంగికదాడులు రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో, పాలకులు, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో భోజన్న,శ్రీకాంత్, సునీల్, అర్జున్, సాయిలు, రమేశ్, సంతోష్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ టీఎస్ మండల కార్యవర్గం

బాసర, సెప్టెంబర్ 11 : బాసర మండల పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ముందుగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే ఏకైక సంఘం పీఆర్టీయూనే అని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీంద్రపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డీ రమేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై లావణ్య, అసోషియేట్ అధ్యక్షుడిగా కౌసర్ అహ్మద్, కార్యదర్శిగా శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందనలు తెలిపారు. పీఆర్టీయూ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

తానూర్, సెప్టెంబర్ 11 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు టీ నరేంద్రబాబు అన్నారు. బుధవారం తానూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయు మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీ పండరి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా స్వరూపరాణి, కార్యదర్శిగా మహ్మద్ ఫాసిల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, అసోసియేట్ అధ్యక్షుడు మల్లన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

తాంసి, సెప్టెంబర్ 11: ఓటరు సవరణ, నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ లక్ష్మి బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ రిజిస్టర్‌లో ఓటరు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ నరేశ్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలపై అవగాహన

తాంసి, సెప్టెంబర్ 11 : తాంసిలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్టీసీ అందిస్తున్న సేవల గురించి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీవోలు శ్రీనివాస్, మధు విద్యార్థులకు ఉచిత బస్ పాసులు, దివ్యాంగులకు పాసులు, శుభకార్యాలకు రాయితీపై బస్సులు, గమ్యం యాప్, రోడ్డు భద్రతా నియమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, కండక్టర్ భూమన్న, ఉపాధ్యాయుడు సతీశ్ పాల్గొన్నారు.

## ఐదు డెంగ్యూ కేసులు నమోదు

తాంసి, సెప్టెంబర్ 11: మండలంలో డెంగ్యూ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సీజన్‌లో మండల కేంద్రంతో పాటు పొన్నారి, బండల్‌నాగాపూర్ గ్రామాలు కలిపి మొత్తం ఐదు కేసులు నమోదైనట్లు మండల వైద్యాధికారి శ్రావ్యవాణి తెలిపారు. మరోవైపు పారిశుధ్య పనులను సంబంధిత అధికారులతో కలిసి ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్ తులసీరామ్, పంచాయతీ కార్యదర్శులు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనులకు టార్పాలిన్లు అందజేత

బేల, సెప్టెంబర్ 11 : ఖడ్కి గ్రామంలో మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ సామ రూపేశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి దిన వ్యవస్థలో ఉన్న పేద కుటుంబాలకు బుధవారం టార్పాలిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గంగేశ్వర్, ఎంసీ మెంబర్ విజయ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు గంగేశ్వర్, ప్రవీణ్, నరేశ్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన దీక్ష

భైంసా, సెప్టెంబర్ 11 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ముథోల్ నియోజకవర్గంలోని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం భైంసాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసనలో ప్రభాకర్, గంగాధర్, నారాయణ, భీంరావ్, అప్పారావు, రాంచందర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 11: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు రాజ్యాంగ విరుద్ధమైన తీర్పునిచ్చిందని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ అన్నారు. ఢిల్లీలో భీం ఆర్మీ నిర్వహించే మహా ర్యాలీకి మద్దతుగా బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధానకార్యదర్శి వాగ్మారే కామ్‌రాజ్, సునీల్, సూర్యవంశీ ఉత్తమ్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

సారంగాపూర్, సెప్టెంబర్ 11: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. బుదవారం ఆలూర్ గ్రామంలో వినాయక మండపాల యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన సమయంలో ఇతరులకు ఇబ్బంది కలుగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భూమేశ్, భోజన్న, లక్ష్మీనారాయణ, రమేశ్, వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

# మళ్లీ మొదలైంది.. అడవుల నరికివేత

- ఈ గొడ్డలి కాటుకు బాధ్యులు ఎవరు...
- రోడ్డుకు కూత వేటు దూరంలో చెట్ల నరికివేత
- అధికారుల పర్యవేక్షణ లేకనే అంతరించి పోతున్న అడవులు

ఖానాపూర్ రూరల్, సెప్టెంబర్ 11 : పదేండ్ల కాలంలో చెట్ల నరికివేత అంటేనే ప్రతి ఒక్కరిలో వణుకు పుట్టేది. చెట్లను నరికే వారిపై కేసీఆర్ ప్రభుత్వం, అటవీ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుండే. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారక ఆ నిబంధనలు తుంగలో తొక్కి కలప స్మగ్లర్లు వీరంగం సృష్టిస్తున్నారు. ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్, సత్తనపల్లి అటవీ శివారులో కలప స్మగ్లర్లు అడవుల నరికివేతను ప్రారంభించారు. 25 రోజులుగా టేకు చెట్లను నరుకుతూ వస్తున్నారు. గత నెలలో సోమార్‌పేట్‌లో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇది తెలిసి కూడా అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. బీర్నంది రోడ్డుకు కూతవేటు దూరంలో అడవుల నరికి వేతకు పాల్పడుతున్నారు. ఎల్లాపూర్ బీట్‌లో సుమారు పది చెట్లు, చింతఒర్రె సమీపంలో పదులకు పైగా టేకు చెట్లను స్మగ్లర్లు హతం చేశారు. ఇప్పటికి అక్కడ ఆనవాలు కనిపిస్తున్నాయి. ఇది జరిగి నెల కూడా కాలేదు. దీనికి కారణం అధికారుల పర్యవేక్షణ లేకనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వైపు అటవీ విస్తీర్ణం పెంచేందుకు హరితహరంలో మొక్కలు నాటుతుంటే అక్రమార్కులు, కలప స్మగ్లర్లు చెట్లు నరికివేస్తూ రవాణాకు పాల్పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడువులకు వెళ్లకుండా అధికారులు ట్రెంచ్‌లను త్రవ్వారు. వాటిని సైతం లెక్క చేయకుండా దారిని మళ్లించి అక్రమ కలపను రవాణా చేస్తున్నారు. కలప దూగాలను ఇసుక ట్రాక్టర్లలో, ద్విచక్రవాహనాలపై తరలిస్తున్నారు.

### అడవుల సంరక్షణకు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

2014న రాష్ట్రం అవతరించక అధికారంలో వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం అడవుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించింది. కేసీఆర్ ప్రభుత్వం అటవీ విస్తీర్ణాన్ని 33 శాతం పెంచడమే లక్ష్యంగా హరితహారం కింద ఏటా మొక్కలను నాటించింది. పది సంవత్సరాలుగా పెద్ద ఎత్తున పెరిగిన టేకు చెట్లు విస్తరించడంతో స్మగ్లర్లు వాటినే టార్గెట్ చేసి నరకివేతకు పాల్పడుతున్నారు. వీరికి అధికార పార్టీ ప్రజ ప్రతినిధుల అండదండాలు, అధికారులు సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి



ఎల్లాపూర్ బీట్ పరిధిలో నరికివేతకు గురైన టేకు చెట్టు



టేకు దూగ నుంచి తొలగించిన కొమ్మలు



కలప తరలించడానకి అడవిలోకి వెళ్లిన వాహనం గీటాలు

### కలప స్మగ్లర్లా పని పడుతాం

అడవుల నరికివేతకు పాల్పడే స్మగ్లర్లు ఎంతటి వారినైన వదిలే ప్రసక్తి లేదు. అటవీ శాఖలో పని చేస్తూ కలప స్మగ్లర్లకు సహకరిస్తున్న ఇంటి దొంగల పని పడుతాం. స్మగ్లర్లకు సహకరించిన వారిపై గట్టి చర్యలుంటాయి. ఏ బీట్ పరిధిలో కలప స్మగ్లింగ్ జరిగిన ఆ అధికారిపై వేటు పడుతుంది. అడవులను కాపాడటమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. అడవులను నరకకుండా చర్యలు చేపడుతాం.

-ఎఫ్ఆర్వో కిరణ్

# గణపయ్య..వెళ్లి రావయ్యా

- పలు చోట్ల ప్రారంభమైన వినాయక నిమజ్జనం

బోథ్/ఇచ్చోడ/దిలావర్‌పూర్/భైంసా/కుంటాల/ముథోల్/తానూర్/కుభీర్/ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 11: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని కొన్ని మండలాల్లో బుధవారం వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. బోథ్ మండలం మర్లపల్లి గ్రామంలో భజన గణేశ్ మండలి, ఇచ్చోడలోని అయ్యప్ప ఆలయంలో కొలువుదీరిన గణనాథుల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలోని ప్లేయర్ హైస్కూల్‌లో, భైంసాలోని శిశు మందిర్ పాఠశాల, విద్యుత్ శాఖ కార్యాలయం, ఎమ్మెల్యే రామారావు పటేల్ నివాసంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ప్రతిష్ఠించిన వినాయకుడిని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.



కుంటాల: వాసవిలో శోభాయాత్రలో పాల్గొన్న విద్యార్థులు



కుంటాల: సృజన విద్యానిలయంలో..

కుంటాలలోని సృజన విద్యానిలయం, కల్లూరులో వాసవి విద్యాసంస్థ, ముథోల్ మండలం తరోడా, ఆష్టా, విట్టోలి, విట్టోలితండా, వెంకటాపూర్, రాంటెక్ గ్రామాల్లో, తానూర్ మండలం దహెగాం, జవులా(కే), హంగిర్గా, దౌలతబాద్, కళ్యాణి, ఖర్బలా, కుప్టి, వడ్‌గావ్, ఝరితండా, వడ్ఝురి, సింగన్‌గావ్, మసల్గా, కోలూర్ గ్రామాల్లో, కుభీర్ మండలం పార్డి(కే), జాంగాం, గోడాపూర్, గోడ్సర, కస్ర, కస్రతండా, లింగి, వాయి, బ్రహ్మేశ్వర్, మార్లగొండ గ్రామాల్లో గణనాథులను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. యువకులు నృత్యాలు చేస్తూ స్థానిక చెరువులు, వాగుల్లో వినాయకుడికి వీడ్కోలు పలుకుతూ నిమజ్జనం చేశారు. ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌కార్యాలయంతో పాటు పలు మండపాల వద్ద శోభాయాత్ర నిర్వహించారు.

## నాల్గవ జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం

ఎదులాపురం, సెప్టెంబర్ 11: నాల్గవ జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ సెంటర్లు లేనటువంటి మండలాల్లో కొత్తవి వచ్చే విధంగా చూడాలని రాష్ట్ర యూఐడీఏఐని ఆదేశించారు. ట్రైబల్ మండలాల్లో జరుగుతున్నటువంటి పీవీటీజీ పీఎం జన్మమాన్‌లో భాగంగా ఇంకా మిగిలి ఉన్న ఎన్రోల్మెంట్స్‌ను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. పౌరులు తమ ఆధార్‌ను 10 సంవత్సరాల దాటిన వారందరూ కచ్చితంగా తమ ఆధార్‌ను దగ్గరలో ఉన్న సెంటర్ వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కమిటీ సభ్యుల ద్వారా తమ డిపార్ట్‌మెంట్ వారికి అవగాహన ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్, డీఎస్పీ, రాష్ట్ర యూఐడీఐ అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్ సహోబన్, ఎల్డీఎమ్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్, ఐటీడీఏ జేడీఎం, డీపీవో, కలెక్టరేట్ సూపరింటెండెంట్, పోస్టల్ డిపార్ట్‌మెంట్, జిల్లా విద్యాశాఖాధికారి, ఈడీఎం, టీఎస్పీఎస్ డీఎం, సీఎస్సీ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

## సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

నార్నూర్, సెప్టెంబర్ 11 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం నార్నూర్ మండలం చిత్తగూడ, మలేపూర్, బాబేఝరి, సుంగపూర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. వర్షాలతో కోతకు గురైన ప్రధాన రహదారులు, వంతెనలు, పంటలను పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆమె వెంట మండలాధ్యక్షుడు లొకండే దేవ్‌రావ్, పవార్ ఇందల్, బాపురావ్, దిగంబర్, నాందేవ్, ప్రేమ్‌సింగ్, ఉమేశ్, గజానన్, శ్రావణ్, శేషారావ్ ఉన్నారు.

## కూలిన ఇల్లు

ఖానాపూర్, సెప్టెంబర్ 11 : ఖానాపూర్‌లోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఉన్న నీరటి రాజవ్వ ఇల్లు మంగళవారం రాత్రి కూలింది. ఆ సమయానికి ఇంటి పరిసరాల్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు బాగా తడిసిపోయి కూలినట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంది.

## పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించాలి

నార్నూర్, సెప్టెంబర్ 11 : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించాలని తహసీల్దార్ జాడి రాజలింగం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

## పారిశుధ్య పనులు పరిశీలన

నార్నూర్, సెప్టెంబర్ 11 : నార్నూర్‌తో పాటు భీంపూర్, తాడిహత్నూర్, మాన్కాపూర్ గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను బుధవారం మండల పంచాయతీ అధికారి స్వప్నశీల పరిశీలించారు. . ఇక్కడ పంచాయతీ కార్యదర్శులు శంకర్, మోతీరాం, రాజశేఖర్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

## దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం



హాజరైన దివ్యాంగులు

భైంసా, సెప్టెంబర్ 11 : పట్టణంలోని గాంధీగంజ్‌లో బుధవారం మహిళా శిశు దివ్యాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహకారంతో దివ్యాంగులకు సహాయ పరికరాలు, ఉపకరణాల కోసం ఎంపిక శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన దివ్యాంగులు గాంధీ గంజ్ వద్ద బారులుదీరారు. వారి సదరమ్ అర్హత పత్రాలతో దరఖాస్తులు అధికారులకు అందించారు.

## విజయవంతం చేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 11 : నిజామాబాద్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించే ఐఎఫ్‌టీయూ ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారతదేశానికి కోట్లాది రూపాయల లాభాలను తీసుకువచ్చే రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసీ, కోల్ ఇండియా, ఓడరేవులు, విమానయానంతో పాటు మినీ రత్న, మహారత్న, నవరత్న, బిరుదులు పొందిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నాని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. నిర్వహించే సదస్సుకు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు ఎం శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది మాధవరావు హాజరుకానున్నారని తెలిపారు. ప్రాంతీయ సదస్సులో జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు సుభాష్, శేషారావు, నర్సింగ్, దేవీదాస్, అఖిల్ పాల్గొన్నారు.

## నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

ఎదులాపురం,సెప్టెంబర్ 11 : గణేశ్ మండపాల వద్ద భద్రతాపరంగా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జీవన్ రెడ్డి సూచించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. ప్రతి నిత్యం మండపాల వద్ద ఇద్దరు అందుబాటులో ఉండేలా చూడడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు లేని కారణంగా పశువులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నిమజ్జనం సందర్భంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు దృష్టికి వస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

## చాంద(టీ) వాగు వద్ద పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు

ఎదులాపురం, సెప్టెంబర్ 11: వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టీ) వాగు వద్ద పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఔట్ పోస్ట్‌ను డీఎస్పీ జీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ముజాహిద్‌తో మాట్లాడి పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాగు వద్ద జాలర్లను అందుబాటులో ఉంచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్ఐ సునీత ఉన్నారు.

## ప్రశాంతంగా శోభాయాత్ర నిర్వహించుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 11 : ప్రశాంత వాతావరణంలో గణేశ్ శోభయాత్రను నిర్వహిచుకోవాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. బుధవారం నిర్మల్‌లోని శోభాయాత్ర మార్గాన్ని మున్సిపల్, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. శోభాయాత్ర మార్గంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలన్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, విద్యుత్ అధికారులు ఉన్నారు.

## చౌకధరల దుకాణం తనిఖీ

తలమడుగు, సెప్టెంబర్ 11: భరంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన, చౌక ధరల దుకాణాన్ని బుధవారం తహసీల్దార్ రాజమోహన్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థుల సంఖ్య అడిగి తెలుసుకొని పిల్లల బరువును చూశారు. పౌష్టికాహారం అందించాలని సూచించారు. అలాగే పల్లె దవాఖానలో రిజిస్టర్లను పరిశీలించారు. రోజువారి కేసులను రిజిస్టర్‌లో పొందుపర్చాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ చంటి, బ్లూబీం యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్, ప్రధాన కార్యదర్శి గంగన్న, సభ్యులు ఉన్నారు.

## వినియోగదారులు సమస్యలు పరిష్కరించుకోవాలి

బోథ్, సెప్టెంబర్ 11 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. బుధవారం బోథ్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ వ్యవస్థ బిల్లులు, ఇతర సమస్యల పరిష్కారం కోసం సదస్సుల్లో అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. సాధ్యమైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా చూస్తున్నామన్నారు. సదస్సుల్లో బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాలకు సంబంధించి పది దరఖాస్తులు రాగా నాలుగు ఈఆర్‌వో పరిధిలో ఉండడంతో అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన ఆరు విద్యుత్ లైన్లు, స్తంభాలకు సంబంధించి ఉండడంతో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చైర్‌పర్సన్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ చౌహాన్, సీజీఆర్ఎఫ్ సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, డీఈలు హరికృష్ణ, ఈదన్న, ఎస్‌డీఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్ఎంలు పాల్గొన్నారు.

## పెరిక సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

బేల, సెప్టెంబర్ 11: బేలలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పెరిక సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెరిక సంఘం సభ్యులు హాజరై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఇంతకు ముందు అధ్యక్షులుగా పని చేసిన వారికి ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ పెరిక సంఘం నూతన మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, ఉపాధ్యక్షులుగా అచ్చ రాజు, గణేశ్, క్యాషియర్‌గా పురుషోత్తంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోరేశ్వర్, సుదర్శన్, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## సబ్సిడీ పోలీస్ క్యాంటీన్ ప్రారంభం

ఎదులాపురం, సెప్టెంబర్ 11: సబ్సిడీ పోలీస్ క్యాంటీన్‌తో 1500 పోలీసు కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నదని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా పోలీసు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన సబ్సిడీ పోలీస్ క్యాంటీన్ (ఎస్‌పీసీ) బుధవారం జిల్లా కేంద్రంలో ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని చక్రపాణి మెమోరియల్ హాల్ వద్ద ఎస్పీ గౌష్ ఆలం, రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్ కలిసి ప్రారంభించారు. జిల్లాలోని పోలీసు యంత్రాంగం సివిల్ ఏఆర్ టీఎస్ఎస్పీ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఇద్దరు దొంగల అరెస్ట్

ఎదులాపురం, సెప్టెంబర్ 11 : రైల్వే స్టేషన్ సమీపంలో గణేశ్ మండపంలోని సౌండ్ బాక్స్‌లను దొంగలించిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. మంగళవారం రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలోని గణేశ్ మండపంలో ఉన్న ఎంప్లిఫైర్, సౌండ్ బాక్సులు దొంగతనం అయ్యాయి. నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మహాలక్ష్మి వాడకు చెందిన షోయబ్ ఖాన్, భాగ్యనగర్‌కు చెందిన అర్షద్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఎంప్లిఫైర్, సౌండ్ బాక్సులు రికవరీ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## గంజాయి పట్టివేత

తలమడుగు, సెప్టెంబర్ 11 : భరంపూర్ గ్రామానికి చెందిన బొల్లారపు నారాయణ గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం రావడంతో బుధవారం ఎస్ఐ అంజమ్మ సిబ్బందితో కలిసి వెళ్లి చూడగా సదరు వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తులకు గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నారు. ఎస్ఐ వివరాల ప్రకారం..సదరు వ్యక్తి ఇంటి వెనుకాల పేరడిలో 55 గంజాయి మొక్కలు ఎండబెట్టినవి, పచ్చి మొక్కలు ఆరు గుర్తించామని తెలిపారు. వీటి బరువు 11 కిలోల 400 గ్రాములు, రూ.లక్షా 14 వేల 900 ఉంటుందని తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అశోక్ రెడ్డి



అల్లూరి అశోక్ రెడ్డి

జైనథ్, సెప్టెంబర్ 11 : జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా సావాపూర్ విలాస్ పాలక మండలి నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా బాస సంతోష్, నిమ్మల ప్రభాకర్, సాదలి రామన్న, నారకట్ల స్వామి, మడావి చంద్రకాంత్, గౌకర్ సీతారాం, తుడుం రాములు, షేక్ మహమూద్, దూమల ఆశక్క, ఏల్మారాం రెడ్డి, విక్రాంత్ కుమార్ కేతన్, తునికివార్ రాజన్న ఖారరయ్యాయి. ఎట్టకేలకు మార్కెట్ కమిటీ నియమకం పట్ల కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## పంటల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

బోథ్, సెప్టెంబర్ 11 : బోథ్ మార్కెట్ కమిటీ యార్డులో త్వరలో ప్రారంభం కానున్న పంటల కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డ గంగారెడ్డి సూచించారు. బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సోయా, పత్తి కొనుగోళ్ల సీజన్ ప్రారంభం కానుందన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాలన్నారు. కవర్ షెడ్, గోడ, అవసరమైన మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఆడె వసంత్‌రావ్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 11 : గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని ఎంపీ నగేశ్ అన్నారు. బుధవారం మండలంలోని ఏందా, ఉమ్రి గ్రామాల్లో పర్యటించారు. ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలు తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రాథోడ్ రితేశ్, మాజీ ఎంపీపీ ఆడే ధన్‌లాల్, మాజీ వైస్ ఎంపీపీ బాలాజీ, మాజీ జడ్పీటీసీ జగ్జీవన్, రమేశ్ పాల్గొన్నారు.

బోథ్, సెప్టెంబర్ 11 : మండలంలోని చింతల్‌బోరి, సొనాల, కోట(కే) గ్రామాల్లో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ పర్యటించారు. చింతల్‌బోరి, కోట(కే) గ్రామాల్లో నిర్వహించిన మహాలక్ష్మీ పూజలో పాల్గొన్నారు. అనంతరం సొనాలకు చెందిన దశరథ్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రావడంతో ఆయనను సత్కరించారు. ఎంపీ వెంట పార్టీ కన్వీనర్ బోరే రవీందర్ నాయకులు సుభాష్ సూర్య, ప్రశాంత్, రాజేశ్వర్, నారాయణ, మురళీధర్, గులాబ్‌సింగ్, పోతారెడ్డి, రాజేశ్వర్, రమేశ్, పోతన్న, షేకన్న ఉన్నారు.

## మైనార్టీ గురుకుల ఉపాధ్యాయుడికి గౌరవ డాక్టరేట్

ఇచ్చోడ, సెప్టెంబర్ 11: ఇచ్చోడ మైనార్టీ గురుకులంలో విధులు నిర్వహిస్తున్న మహేశ్‌కు వృక్షశాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఫైటో కెమికల్స్ ఏనాలసిస్ అండ్ సిల్వర్ నానో పార్టికల్స్ ఫ్రాం రివియ హైపో క్రాటరి ఫార్మసీ ఇట్స్ బయోలాజికల్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధనలు చేశారు. మహేశ్‌ను ప్రిన్సిపాల్ యూనిస్ సలీం సన్మానించారు.

## ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలించాలి

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 11: ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా నిర్మూలించాలని సిరికొండ తహసీల్దార్ ఉపేంద్ర అన్నారు. బుధవారం సిరికొండ మండలం సుంకిడి గ్రామంలో మండల సమాఖ్య సౌజన్యంతో ప్లాస్టిక్ రహిత గ్రామానికి తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం సంతోష్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

తలమడుగు, సెప్టెంబర్ 11: ఖోడద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈవో సోమయ్య తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలకు మొదటిసారిగా వచ్చిన ఎంఈవోను ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, ఉపాధ్యాయ బృందంతో కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఉట్నూర్ సబ్ కలెక్టర్‌కు సన్మానం

ఉట్నూర్, సెప్టెంబర్ 11 : ఉట్నూర్ సబ్ డివిజన్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్ మర్మాట్‌ను బీఆర్ఎస్ నాయకులు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉట్నూర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సోషల్ మీడియా నాయకులు బాబా టైగర్, మహేందర్, పవార్ క్రాంతి, సాజిద్, సిద్దిక్ పాల్గొన్నారు.


## నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఇమ్రాన్



షేక్ ఇమ్రాన్

ఇచ్చోడ, సెప్టెంబర్ 11 : ఇచ్చోడ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్‌ను నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంస్థ చైర్మన్ అమాన్ గుప్తా వెల్లడించారు. షేక్ ఇమ్రాన్ గతంలో జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంస్థ చైర్మన్, జాతీయ అధ్యక్షుడు సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అడవి పందిని ఢీ కొని ఒకరి మృతి



సిర్సట్ హనుమాన్(ఫైల్)

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 11 : ఇంద్రవెల్లి మండలం మెండపల్లి గ్రామానికి చెందిన సిర్సట్ హనుమాన్(28) అడవి పందిని ఢీ కొని మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం... సిర్సట్ హనుమాన్ ముత్నూర్‌లో పాన్‌షాపు నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రతిరోజూ మాదిరిగానే మంగళవారం కుడా ముత్నూర్ గ్రామానికి వచ్చి పాన్‌షాపు నడిపించాడు. మంగళవారం రాత్రి 11.30 గంటలకు తన స్నేహితుడి మోటార్ సైకిల్ తీసుకొని మెండపల్లి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో అడవి పందులు రాగానే వాటిని తప్పించపోయి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన గ్రామస్తులు రోడ్డుపై పడిఉన్న హనుమాన్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. మృత్యుడి తండ్రి సిర్సట్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. మృత్యుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.